# మాధవి




## యర్రమిల్లి శేఖర్

బయటకు చూశాను. స్కూటర్ స్టాండ్ వేసి గేటు తీసుకొని లోపలికి వస్తున్న మాధవి కనపడింది.

మాధవి సన్నగా పొడవుగా ఉండదు. పొట్టిగా, ఒక మోస్తరు లావుగా వుంటుంది. తెల్లటి దేహచ్ఛాయ, ఆమె చూపుల్లో మెరుపు లు, హావభావాల్లో ఉత్సాహం చూపరులను ఆకర్షిస్తాయి. మాధవితో నా పరిచయం ఈ నాటిది కాదు. ఇరవై ఏళ్ళ పాతది.

హైస్కూల్లోను, కాలేజీలోను కూడా మాధవి నాకు రెండేళ్ల జూనియరు, హైస్కూలు రోజుల్లో ఆమె ఉత్సాహానికి ప్రతీకగా ఉండేది. ఆటలు కానివ్వండి, డిబేట్స్ కానివ్వండి, మరొకటి కానివ్వండి ఆమెకు బహుమతి రాని కార్యక్రమం ఉండేది కాదు, కాలేజీలోకి వచ్చాక కూడా ఆమెలో ఉత్సాహం ఏ మాత్రం సన్నగిల్ల లేదు. ఆ కోఎడ్యుకేషన్ కాలేజీలో ప్రెసిడెంట్ పదవికి పోటీ చేసి నెగ్గి చరిత్ర సృష్టించి మొదటి లేడీ ప్రెసిడెంట్ అయింది. ఆమె గురించి ఇన్ని వివరాలు చెప్ప టంలో నా ఆంతర్యం ఏమిటని మీరు అను కుంటే నాది ఒకటే జవాబు. అలాంటి అందమైన, చైతన్యవంతమైన అమ్మాయి తమ జీవిత భాగస్వామిని కావాలని ఆ రోజుల్లో ఉవ్వి ళ్లూరిన చాలా మంది కాలేజీ కుర్రాళ్లలో నేనూ ఒకణ్ణి. అందరి మాట ఎలా ఉన్నా, నా వరకు "మాధవి అందని మానిపండు. ఒక్క చదువు విషయంలోనే కాదు, ఆర్థిక పరిస్థితి కూడా ఆమెకు నాకు చాలా వ్యత్యాసం ఉంది. అందువల్ల ఆమెకు సంబంధించిన ఆలోచన లను నా ఊహల వరకే పరిమితం చేసుకున్నా ను. అంటే నా అభిప్రాయం ఆమెకు దూరం గా ఉంటూ వచ్చానని కాదు. చాలా సార్లు ఆమెతో నేను మాట్లాడాను. ఒకటి రెండు సార్లు వాళ్లింటికి వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, ప్రతి సందర్భంలో, ఇమె మాటలో, ప్రవర్తనలో, ప్రతి చర్యలో నాకు అహంభావం కొట్టొచ్చినట్లు కనపడేది.

ఆమెను అందుకోలేని స్థితిలో ఉన్న నేను, ఇది ఆమె పట్ల ఏర్పరుచుకున్న దురభిప్రాయ మని మీరనుకుంటే చెప్పలేను కాని, ఆనాటి నా అంచనా ప్రకారం ఆమె అణువణువునా అహంభావం ఉన్నది. ఆమె ఉన్నలాంటి పరి స్థితిలో ఉన్న ఎవరికైనా అహంభావం ఉం డటం ఒక వింతైన విషయం కాదు అనే విష యాన్ని నేను మనస్ఫూర్తిగా అంగీకరిస్తాను. కాలేజీ చదువు ముగిసిన ఏడాది వరకు అతి సాదాగా నడిచిన నా జీవితం ఆ తర్వాత అద్భు తమైన మలుపు తిరిగింది. అందుకు కారణం కోటేశ్వరరావు గారు. ఆయన మాకు దూర పు బంధువు.

కోటేశ్వరరావుగారు బంగారు చెంచా నో ట్లో పెట్టుకొని పుట్టిన అదృష్టవంతుడు,

ఐశ్వర్యవంతుడు. ఆస్తి ఎంత వున్నా ఆయనకు పిల్లలు మాత్రం ఇద్దరే. కూతురు, కొడుకు. ఆయన కూతురికి పెళ్ళి సంబంధాలు వెతుకుతున్న రోజుల్లో ఆయన కంట్లో నేను పడ్డాను. ఆయన చేతుల్లో నా జాతక చక్రం పడింది.

కోటేశ్వరరావుగారు కృషిని, శ్రమని క్వాలిఫికేషన్లనీ కాకుండా శకునాల్ని, జాతకాల్ని, సెంటిమెంట్లనీ నమ్మే మనిషి. ఏ దేవుడు కరుణించాడో తెలియదుగాని నా జాతకం ఆయనకు బ్రహ్మాండంగా నచ్చింది.

ఒక పేద ఇంట్లో నలుగురిలో ఒకడుగా పుట్టి, ఏ ఆశలు తీరని నిరుద్యోగిగా రోజులు వెళ్ళదీస్తున్న నాకు ఇంతకంటే మంచి అవకాశం ఏం ఉంటుంది? మా అమ్మ నాన్నలు కూడా ఇందుకు అభ్యంతరం పెట్టలేదు. మనోరమతో నా వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. నా ఉనికి పట్నంలో అత్తవారింటికి చేరింది. నేను అత్తవారింట్లో కాలు పెట్టాక అంతా ఏదో "మిడతం భొట్లు" కథలో లాగా సాగింది. నాకు మనోరమతో పెళ్ళయ్యాక ఆయనకు వ్యాపారంలో బాగా కలిసి రావడం, నేను యథాలాపంగా ఇచ్చిన కొన్ని సలహాలు ఆయన అమోఘమైన ఫలితాలు తెచ్చి పెట్టాయి. ఆయనకు నా మీద ఎనలేని గౌరవం ఏర్పడటానికి కారణాలయినాయి. ప్రతిరోజూ షేర్ మార్కెట్‌ను స్టడీ చేసి, ఎప్పుడు ఎందులో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు ఆర్జించే అవకాశం ఉన్నదో ఆయనకు సూచించటం నా పని. ప్రస్తుతానికి ఇదే నా ప్రధాన వ్యాపకం.

ఆ ఇంట్లో నా మాట వేదంలా చలామణి కావటం, అందరూ కలిసి నన్ను అందలం మీద కూర్చోపెట్టటం, నేను పట్టిందల్లా బంగారం కావటం, అన్నీ కలిసి నా ప్రవృత్తిలో మార్పు తీసుకొచ్చిన మాట నిజం అని నేను అంగీకరిస్తాను. ఇతరులతో మాట్లాడేటప్పుడు నేను ప్రదర్శిస్తుండే వినయం, మర్యాద దూరమై వాటి స్థానంలో దర్పం చోటు చేసుకోనారంభించింది. నా స్నేహితుల్లో ఒకరిద్దరు గర్వం నా తలకెక్కింది అని అనుకోవటం కూడా నా చెవులబడింది. అయితే అలాంటి మాటలకు ఎలాంటి ప్రాముఖ్యత ఇవ్వవలసిన అవసరం లేదనిపించింది.

ఒక రోజు మాధవి దగ్గర్నుండి నాకు ఫోన్ వచ్చింది. మాధవి చెల్లెలు వైష్ణవిని మా బావమరిదికి ఇచ్చి చేయాలనే ప్రతిపాదన చేసే ప్రయత్నంలో ఆమె ఫోన్ చేసింది. మా బావమరిది మనోహర్ ఇంజనీరు, పైగా రూపవంతుడు, ఆస్తిపాస్తులు విషయం చెప్పనే అక్కర్లేదు. ఆమె నోటి వెంట ఆ ప్రతిపాదన విన్నాక ఆమెతో నేను ఐదు నిమిషాల్లో ఎక్కడలేని దర్పం ఒలకబోశాను. ఫోన్ పెట్టేసే ముందు మాట్లాడుకోవటానికి మా ఇంటికి రమ్మని ఆమెను ఆహ్వానించాను. పెళ్ళి సంబంధాల విషయంలో మగవాళ్ళే సూత్రధారులుగా ఉండటం సాధారణంగా జరిగే పని, అయితే అందుకు భిన్నంగా, చెల్లెలి పెళ్ళి విషయంలో మాధవి ఫోన్ చెయ్యటం, నా ఆహ్వానాన్ని మన్నించి స్వయంగా వస్తాననటం తలచుకుంటే ఆమె వ్యక్తిత్వానికి, కార్యశూరతకి ముగ్ధులైన పుట్టింటివారు, అత్తింటివారు ఇలాంటి ముఖ్యమైన పనులకి ఆమె మీదనే ఆధారపడతారేమోననిపించింది. ఆ! అన్నట్లు మాధవి గురించిన మరో ముఖ్యమైన విషయం మీకు చెప్పటం మరచాను. ఆమె ఒక బ్యాంకి ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తోంది.

నేను పడగ్గదిలోంచి లేచి ఎదురు వెళ్ళి మాధవిని లోపలికి ఆహ్వానించాను. ఐదేళ్ళ క్రితం ఆమె పెళ్ళికి వెళ్ళాను. ఆ తర్వాత దాదాపుగా ఆమెను చూడలేదనే చెప్పాలి. అప్పటికి, ఇప్పటికి ముఖంలో ఎక్కువ మార్పు లేక పోయినా, శారీరకంగా కొంచెం వొళ్ళు చేసింది. పది నిమిషాలసేపు మా మధ్య కుశల ప్రశ్నలు కాలేజీముచ్చట్లు నడిచాక, మనోరమ లోపలి నుండి కాఫీ, ఫలహారాలు తెచ్చి 'టీపాయ్' మీద పెట్టింది. నేను మనోరమను మాధవికి పరిచయం చేశాను. మా ముగ్గురి మధ్య అరగంట సేపు మాటలు నడిచాక మాధవి వెళ్ళటానికి ఉద్యుక్తురాలైంది. వెళ్ళే ముందు వైష్ణవి ఫోటో, జాతకం నాకిచ్చింది.

మాధవి స్కూటరెక్కి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళినవంకే చూస్తుంటే ఏదో విధంగా ఈ పెళ్ళి సంబంధం వంకతో ఆమెను కనీసం పది, పన్నెండు సార్లయినా మా ఇంటి చుట్టూ తిప్పించాలనే చిలిపి కోరిక పుట్టింది. మా బావమరిది పెళ్ళి సంబంధాలకు సంబంధించిన బాధ్యతంతా మా మామగారు నాకే అప్పగించారు కాబట్టి నాకు అదేమంత కష్టమయిన పని కానే కాదు, అయితే నా కోర్కె తీర్చుకోవటానికి ఒక అవాంతరం ఏర్పడింది. మానాన్నగారికి ఆరోగ్యం బాగోలేదని టెలిగ్రాం రావటంవల్ల, ఆ మర్నాడే బయల్దేరి నేను ఊరికి వెళ్ళవలసి వచ్చింది. వెళ్ళిన వాణ్ణి అనివార్యమైన పరిస్థితుల్లో పది రోజులు అక్కడే ఉండి పోవలసి వచ్చింది. తిరిగి వచ్చి మా అత్తవారింట్లో కాలుమోపేసరికి అక్కడి వాతావరణంలో ఏదో సందడి, హడావిడి చోటు చేసుకున్నట్లు అనిపించింది.

"అమ్మయ్య! బావగారూ, వచ్చేశారా? ఈ రోజు సాయంత్రం దాకా చూసి మీరు రాకపోతే, నేను మీ దగ్గరకి బయల్దేరి వద్దామనుకుంటున్నాను" అన్నాడు మా బావ


రుచికరమైన 19
రకాలలో లభ్యం
కాగలవు.




ఇంట్లో తయారు చేసినట్లు రుచి. తయారుచేసుకునే శ్రమే లేదు.

మరిది నన్ను చూస్తూనే — అతడి ఆత్రం, ఉత్సాహం ఎందుకో నాకు అర్థం కాలేదు.

"ఏమిటి, అలా చూస్తూ నిలబడ్డారు? తొందరగా లోపలికి వెళ్ళి, ఆ రైలు గుడ్డలు విడిచేసి, స్నానం చేసి, భోజనం కానిచ్చి బయల్దేరండి. మనకి చెప్పలేనన్ని పనులున్నాయి" అన్నాడు మళ్లీ. నేను ఏమీ అర్థం కానట్లు అతడి ముఖంలోకి చూస్తూ నిలబడ్డాను. అప్పుడు గుర్తొచ్చింది అతడికి, తన పెళ్ళి కుదిరినట్లు నాకు తెలియదనే విషయం.

"క్షమించండి బావగారూ! ఇంతకీ అసలు విషయం మీకు చెప్పటం మరిచాను. నాకు, వైష్ణవికీ పెళ్ళి సెటిలయింది. వచ్చే ఆదివారం నాడే ముహూర్తం. ఇంక వారం రోజులు కూడా వ్యవధి లేదు" అన్నాడు.

నా చెవులను నేనే నమ్మలేక పోయాను క్షణం సేపు. నేను ఉన్నది మా అత్తవారిల్లు అవునా? కాదా? అనే అనుమానంలో పడి పోయాను. నేను ఊళ్లో లేని నెల్లాళ్లలో మాధవి ఇంట్లో మనుషులందర్నీ మంత్రించి మార్చేసినట్లనిపించింది. మనసులో ఆమె మీద కోపం ఉవ్వెత్తున ఎగిసింది. ఆ కోపం ఎలా తీర్చుకోవాలా అని ఆలోచించి, పెళ్ళిలో ఏదో ఒక వివాదం సృష్టించే ఉద్దేశంతో రకరకాల పథకాలు వేశాను.

అయితే మాధవి పెళ్ళిలో అతి చాకచక్యంతో నేను చేసిన ప్రతి ప్రయత్నాన్ని పడగొట్టింది. నాతో సహా అందరం పెళ్ళిలో వాళ్ళు చేసిన ఏర్పాట్లకి, ప్రవర్తించినతీరుకుముగ్ధులమైనాం.

పెళ్ళి ముగిసింది, లోపల అందరూ అప్పగింతల హడావిడిలో ఉన్నారు. ఒక సిగరెట్ పీల్చి రిలాక్స్ అవుదామన్నట్లుగా బయటకు వచ్చాను. ఎప్పుడు చూసిందో నా వెనకే బయటకు వచ్చింది మాధవి. జరీ అంచు ఆకుపచ్చ పట్టు చీర, నడుం చుట్టూ సన్నని బంగారు మొలనూలు, చెవులకు జూకాలు, మెడలో రవ్వల నెక్లెసు. ప్రశ్నార్థకంగా నేను మాధవి ముఖంలోకి చూశాను. పెళ్ళి హడావిడి అంతా ఆమె ముఖంలో ప్రతిఫలిస్తోంది.

"నిన్నటి నుండి మీతో మాట్లాడదామని ప్రయత్నిస్తున్నాను. వీలు కాలేదు. మీరు వచ్చేదాకా ఆగి పెళ్ళి నిశ్చయం చేసుకుందామని విశ్వప్రయత్నం చేశాను. నా చేత కాలేదు. మీ బావ మరిదికి మా చెల్లెలు నచ్చిందంట. మీ మామ గారికి దాని జాతకం నచ్చింది. ఈ ముహూర్తం తప్పితే తొందర్లో మరో మంచి ముహూర్తం లేదని మా నాన్నగారి ఆరాటం. అన్నీ ఒకదాని వెంట ఒకటి అలా తోసుకు వచ్చేశాయి.

ఈ విషయంలో నావల్ల ఏదైనా తప్పు జరిగిందని మీరు భావిస్తే దయచేసి క్షమించండి. అది సరే! లోపల అందరూ వాళ్లిద్దర్నీ ఆశీర్వదిస్తుంటే మీరేమిటి ఇలా బయటకువచ్చారు? రండి, రండి లోపలికి వెళదాం" అన్నది. నా మనసులో అప్పటివరకు ఆమె మీద వున్న కోపం ఒక్కసారిగా అదృశ్యమయింది. సిగరెట్ వెలిగించే ప్రయత్నం వాయిదా వేసుకొని ఆమె వెంట లోపలికి నడిచాను. నాకు ఇప్పుడు మాధవిలోని "అహంభావం" కనిపించలేదు. ఏ పనయినా చాకచక్యంగా చెయ్యగల ఆమె లోని "ప్రజ్ఞ" కనిపిస్తోంది. ఆమెలోని గొప్పతనాన్ని నేను చాలా ఆలస్యంగా గ్రహించానని ఎవరైనా అన్నా, నేను వాళ్లతో విభేదించను.

○

## కుందుర్తి కవితా దృక్పథం

'నాలోని వాదాలు'

రచన: టి.లక్ష్మీనారాయణ (రఘువర్మ)
పరిశోధకుడు
1–1–3363/5,
వివేక్‌నగర్,
హైదరాబాద్ – 20
వెల: రూ.25/–



తెలుగు పరిశోధనారంగంలో ఒక విప్లవాత్మకమైన పరిణామం వచ్చింది. పురాణాల దగ్గర ఎక్కడో ఆగిపోకుండా చూపును ముందుకు సాచి, అత్యాధునిక సాహిత్యంపై పరిశోధనలు జరపాలనుకుంటున్నారు. యువ పరిశోధకులు ఇది హర్షించదగ్గ విషయం. కాని, శ్రమించకుండా డిగ్రీలు కావాలనుకోవడం వల్ల తక్కువస్థాయి సిద్ధాంత గ్రంథాలు ఎక్కువగా వెలువడుతున్నాయి. పరిశోధనా వ్యాసాల్ని సామాన్య పాఠకులకు పుస్తకంగా అందిస్తున్నప్పుడు, తెలుగు పంతుళ్ళుకొన్ని చాదస్తాల్ని ఇక వదిలించుకోక తప్పదు. ఉదాహరణకు టి.లక్ష్మీనారాయణ (రఘువర్మ) గారు "కుందుర్తి కవితా దృక్పథం—నాలోని వాదాలు ఎం.ఫిల్ పరిశోధనా వ్యాసం రాశారు. అది తొంభై పేజీల పుస్తకంగా అచ్చయ్యింది ఇందులో అభిప్రాయాలు, అభినందనలు, దీవెనలు, ఆశీస్సులు, ఆకాంక్షలు, అంకితాలు, కృతజ్ఞతాంజలులు వగైరాలన్నీ కలిసి ఇరవైమూడు పేజీలు తినేశాయి. అధ్యాయాల్ని తెలియజేసే పేజీలు, సూచికలు, ఆధార గ్రంథాల పట్టిక కలిపి సుమారు పదిహేడు పేజీలు ఆక్రమించాయి. పోతే అసలు సిద్ధాంత వ్యాసం యాభై పేజీలు మిగులుతుంది. (పాఠకులు వెతుక్కునేది ఇదే) ఇందులో వ్యాసకర్త ప్రతి పేజీకీ 'కోట్' చేసినవి ఎనిమిది నుండి పదిదాకా ఉన్నాయి. అంటే కోట్ చేస్తూ పోయిన విషయాలు నలభైఅయిదు పేజీల దాకా వస్తాయి. ఇకపోతే ఈ యువ పరిశోధకుడి స్వంత వాక్యాలు పుస్తకంలో యాభైదాకా ఉంటాయేమో. అందులోనూ ఆయన ఆలోచనలు, పరిశోధించి ప్రతిపాదించిన అంశాలూ ఏవని? పుస్తకం చివరి పేజీ చదివిన తరువాత అనిపిస్తుంది! 'ఈ గ్రంథం తెలుగు విశ్వవిద్యాలయంవారి ఆర్థిక సహాయముచే ప్రకటితము.'

—డి.కృష్ణకుమారి